కథా నిలయం
4629
శ్రీకాకుళం

# బుద్ధి

"ఎక్కడ నుంచండి ఆ ఉత్తరం?..." అడిగింది శోభ.

"మా నాన్న వ్రాశారు ... ముక్తసరిగా" జవాబి చ్చేడు ప్రసాద్.

"డబ్బేదైనా పంపమని వ్రాశారా..." శోభ మాటలో వెటకారం చోటు చేసుకుంది.

"కాదు—రేపు శుక్రవారం రైలుకి సీతను పంపిస్తు న్నట్టు వ్రాశాడు."

"ఇక్కడ మనం ఏంబావుకుతింటున్నామోనని ఆమెను కూడా ఇక్కడికే పంపుతున్నారన్నమాట..."

"పోన్లే. శోభా — మన నలుగురితో పాటు అయి దోది. రాకరాక వస్తోంది — మనకున్న ఉప్పో కారమో పెడదాం..."

"పెళ్ళి అయ్యేవరకు మనింట్లో తిష్టవేయించే ఏర్పాటు లోనే బయలుదేర తీసి ఉంటారు మీనాన్న— అసలే ఒంట్లో శక్తి సన్నగిల్లుతూంది నాకు. అడ్డమైనవారికీ వండి వార్చ టానికీ., చాకిరీ చేయటానికి నాకు ఓపిక లేదు" నిర్లక్ష్యంగా అంది.

"నా చెల్లెలు అబ్బురంగా పుట్టి పెరిగిందేమీ కాదు. నువ్వొక్క దానివే పన్లన్నీ చేస్తుంటే చూస్తూ ఊరుకునేం దుకు .." సమర్థించబోయాడు ప్రసాద్.

"ఆ ఆ! — నా నెత్తినెక్కి తొక్కకుండాఉంటే అదే పదివేలు. కనీసం ఒక పని మనిషినైనా పెట్టుకుందుకు చేత కాని బ్రతుకైంది..." కటువుగా అంది శోభ.

"నీ మొగుడు ఆఫీస రుద్యోగం చేస్తున్నాడనుకు న్నావా నౌకర్లనూ వంటవాళ్ళనూ పెట్టుకునేందుకు? — అన్నీ తెలిసి నువ్విట్లా నిష్ఠూరంగా మాట్లాడటం నాకు నచ్చదు..."

శోభ సిధింపూ... కోపం భర్తమీద కాదు; ఆడబిడ్డ వచ్చి ఇంట్లో తిష్ఠ వేయబోతోన్నందుకు బాధగా ఉంది.

తీరా ఆడబిడ్డ వచ్చేక తన సరదాలు ఎక్కడ తీరక పోతాయో నన్న భీతి శోభలో ప్రవేశించిందప్పుడే.

"అయితే యింకేం ... మీ చెల్లెలు ఇక్కడికొచ్చి మకాం పెట్టబోతుందిగా ... ఇక మీరు నెలనెలా మీ

వాళ్ళకు పంపే ఏభై రూపాయలూ పంపక పోతే మాత్రం ఏం? —"

అత్తమామలకు పంపే డబ్బు ఏదో నెపంతో ఆపు చేయించగలిగితే తాను మరో చీర కొనుక్కో గలుగుతుంది. లేదా నెలకు నాలుగు సినిమాలు అదనంగా చూసేటందుకు ఖర్చు పెట్టుకోవచ్చు. అందుకే ముందు చూపుతో ఒక చురక అంటించింది శోభ.

"సీత ఒక్కతే మనతో ఉంటుందిగదాని నెలనెలా పంపుతున్న డబ్బు పంపక పోతే ఎట్లా శోభా?! — మిగతా వాళ్ళు ఏం తిని బ్రతుకుతారూ? ..."

"ఇంటి అద్దె ఖర్చు ఎట్లాగూ లేదు. ఇకపోతే మీ నాన్నగారు ప్రయివేట్లు చెప్పి సంపాదించుకునే వంద రూపాయలూ వాళ్ళ నలుగురికీ చాలదా ఏం?—" నొసలు చిట్లించి దీర్ఘాలు తీస్తూ చిత్రంగా అభినయిస్తూ అంది.

"నెలకు అయిదు వందలొస్తుంటే మనకే చాలటం లేదు. అలాంటిది ముష్టి వంద రూపాయలతో వాళ్ళు బ్రతికే దెట్లా?"

"అయితే యింకేం?— మమ్మల్ని గూడా మార్చి అయినా సరే, మరో వంద పంపించండి. అసలే జాలిగుండె మీది. మీకు మీ అమ్మ, నాన్నే ఎక్కువ. నేనూ పిల్లలూ

ఎన్ని ఇబ్బందులు పడినా మీకు చీమ కుట్టినట్టయినా ఉండదు..." గుసగుసలాడుతూ ఎత్తి పొదువుగా అంది.

శోభ మాటలు ప్రసాద్‌కిదేం కొత్తగా అనిపించలేదు. భార్య గయ్యాళిది కాదనే నిజమూ తెలుసు.

అయితే ... భర్త వైపు వాళ్ళు వచ్చి ఎక్కడ తిని పోతారో అని సహజంగా కోడళ్ళలో ఉండే ఈర్ష్యా ద్వేషాలు శోభలోనూ ఉన్నాయి అంతే!

అందుకే అంతకు మించి మాట్లాడి శోభతో ఘర్షణ పడటం ఇష్టం లేక పోయింది — ప్రసాద్‌కి.

*   *   *   *

ఆడబిడ్డ వచ్చినప్పటి నుండి శోభకి బాగా విశ్రాంతి దొరికినట్లనిపిస్తోంది.

అన్నగారింట్లో ఎంత అణకువగా ఉండాల్సిందీ తల్లితండ్రులు చెప్పి పంపించారేమో... చుట్టం చూపుగా పది రోజులు అన్నగారింట్లో ఉండిపోదామని వచ్చినా, కాఫీగ్లాసులు కడగటం దగ్గరనుంచి పప్పు రుబ్బటం దాకా అన్ని పన్లూ విధిగా చేసుకు పోతోంది సీత.

సీత పన్లన్నీ చకచకా చేసుకు పోతుంటే కనీసం మనసులోనైనా ముచ్చట పడక పోగా...అంట్లగిన్నె మసిపోలేదు.. స్టీలు గ్లాసు మరకలు అలాగే ఉన్నాయి అంటూ వంకలు పెట్టడం ద్వారా వదినగా తన అధికారాన్నీ గొప్పనీ మరింత పెంచుకో ప్రయత్నిస్తోంది శోభ.

ఇంట్లో అడుగు పెట్టిన క్షణం నుంచి ఇంట్లో చాకిరీ మొత్తం సీత ఒక్కతే చేసుకు పోవటం గమనించిన ప్రసాద్ మనసు బాధ పడ్డది.

ఇంటికి రాక రాక ఆడపిల్ల వస్తే దాని కేదైనా చేసి పెట్టాల్సింది పోయి అడ్డమైన చాకిరీ దాని చేత చేయించటం ఏం బావుంది. చెప్పు?— చూస్తూ ఊరుకోలేక హెచ్చరించాడు ప్రసాద్.

"చాల్లే, ఊరుకుందురూ— ఇంట్లో పనులు చేసుకుంటే ఆడపిల్ల అరిగిపోతుందా ఏం? పెళ్ళి కావలసిన—పిల్ల 'పనులు నేర్చుకోవడం చేయటం, అబ్బురమేమీ కాదు—" సమర్థింపుగా జవాబిచ్చింది శోభ.

" అంతేలే! — నీ ఒళ్ళు కాకపోతే సరి!! ఎదుటివారి కష్టాన్ని అర్థం చేసుకోగల మంచి మనసు నీకా భగవంతు డివ్వలేదు...." అనేసి సరిపెట్టుకున్నాడు ప్రస్తుతానికి.

"ఆవకాయ సీజను కదాని నాలుగు కిలోలు మిరపకాయలు కొట్టించాను. సీత మెత్తగా దంచుతుంటే జల్లెడ పడుతూ నేనూ సాయ పడ్డాను. నేను మాత్రం ఊరికే కూర్చున్నానా ఏం..." ఆకులకు సున్నం రాసి, మడతలు చుట్టి భర్తకు అందిస్తూ ఘనకార్యం చేసిన దానిలా చెప్పింది.

పద్దెనిమిదేళ్ళయినా పూర్తిగా నిండని పసిదాని చేత ఎర్రని ఎండలో నాలుగు కిలోల మిరపకాయలు కారం కొట్టించి

నందుకు నొచ్చుకున్నాడు ప్రసాద్. మనసు బాధతో మూలిగింది.

"అది సరే... రేపు ఆఫీసు నుండి వస్తూ అట్లా మార్కెట్టు కెళ్ళి బూడిద గుమ్మడికాయ పట్రండి. వడియాలు పెట్టాలనుకుంటున్నాను. వడియాలు పెట్టి ఎన్నాళ్ళాయె! — పైగా పనిలో పని అదీ అయిపోతే ఏటి కేడాది ఉంటాయ్ భోజనం లోకి అధరువుగా..." మళ్ళీ శోభ అంది.

'నువ్వు మనిషివి కాదే ... రాక్షసివి ...' అని లోలోపలే గొణుక్కున్నాడు ప్రసాద్.

"ఎందుకల్లా కొరికేసినట్టు చూస్తారూ? — మీ చెల్లెలేం అరిగి పోదులెండి. సీత వెళ్ళే రోజున దానికి చేతికి నాలుగు వడియాలు, రెండు అప్పడాలు ఇచ్చి పంపిస్తాన్లెండి మీ వాళ్ళకు..."

ఇంకేమీ మాట్లాడాలనిపించ లేదు ప్రసాద్‌కి. భార్య నోరు ఎట్లా మూయించగలగటమనే ఆలోచిస్తున్నాడు. సీత రాకపోయినా బావుండే దన్పించింది.

"ఆడవాళ్ళం ... మా విషయాలు మీకెందుకు — చెప్పండి?" అనేసి వెళ్ళిపోయింది శోభ దులబరించుకొని.

భార్య మాటకి ఎదురు చెప్పలేని తన అశక్తతకు మరో సారి తనను తాను నిందించుకున్నాడు.

పెళ్ళినాటి లగాయతూ శోభ మాటకి ఎదురు చెప్పే అలవాటు లేని ప్రసాద్ ... ఏ విషయంలో నైనా ఘర్షణ పడితే నలుగురూ విని నవ్వి పోతారేమోననే అభిమానంతో అన్నిటికీ తానే సర్దుకు పోవడం తప్పని సరవుతోంది.

అన్నీ తెలుసు ప్రసాద్‌కి. అందుకే నోరు మెదపలేక పోతున్నాడు.

*　　　*　　　*　　　*

సీత ఒళ్ళు జ్వరంతో కాలిపోతూంది.

ఎర్రని ఎండలో కారం కొట్టాల్సిరావటం ... ఆ మర్నాడు వడియాలకనేసి పప్పురుబ్బటంతో ... ఒళ్ళంతా విరగ గొట్టినట్టుగా ఉంది. భరించలేని తలనొప్పిగానూ వుంది.

వదిన ఇచ్చిన అమృతాంజనం కణతలకు పట్టించి, మిరియాల కషాయం మాత్రం తాగి పడుకుంది.

మరునాటికి జ్వర తీవ్రత హెచ్చింది. మనిషి బాధతో మెలికలు తిరిగి పోతోంది.

మూసిన కన్ను తెరువకుండా మంచంలో మూలుగుతూ పడుకుంది.

ప్రసాద్ ఆఫీసు నుంచి రాగానే సీతను పలుకరించాడు. భార్య ఇంట్లో లేకుండా మేట్నీ సినిమాకి వెళ్ళినందుకు రుస రుసలాడేడు, పిల్లల్ని కసురుకున్నాడు,

అన్నయ్యా... డాక్టరుకు చూపించి ఇంజక్షనేదైనా ఇప్పించవా..." దీనంగా అడిగింది సీత.

ఆ మాటకి కరిగిపోయాడు ప్రసాద్.

చెల్లెలి అభ్యర్థనలో జాలి చోటుచేసుకోవటం గ్రహించ లేకపోలేదు, ప్రసాద్.

"ఈ మాత్రం దానికి డాక్టర్లూ ఇంజక్షన్లూ దేనికి?... మరోసారి కషాయం కాచి ఇస్తాను తాగేయ్. అదే తగ్గిపోతుంది." అప్పుడే ఇంట్లోకి అడుగు పెట్టిన శోభ అంది.

"జ్వరంతో దాని ప్రాణం విలవిల్లాడి పోతుంటే, కషాయం కాకరకాయ రసం అంటావేం, శోభా?" మందలింపుగా అన్నాడు.

"ఒక్కరోజు జ్వరానికి మరీ అంత ఇదైపోతారేమిటండీ? జ్వరాలు ఎవరికి రావూ?... చిన్నదానికీ పొన్నదానికీ డాక్టర్లదగ్గరికి పరుగెడితే...పాతికరూపాయలు ఫీజంటారు... యాభై రూపాయల మందులంటారు. ఎందుకొచ్చిన ఖర్చూ? ... అసలే డబ్బు లేదనుకుంటూ ..."

ఆ మాటకి అవాక్కయి పోయాడు ప్రసాద్.

"అది కాదే. . . ." అనేసి ఏదో చెప్పబోయాడు.

"అవున్లెండి — ఇంటి ఖర్చుకి అయిదు రూపాయలడిగితే మీదగ్గరుండవ్. చెల్లెలొచ్చిందిగదాని వెనకా ముందూ చూచుకోకుండా ఖర్చు పెట్టేందుకు మాత్రం వెనకాడరు. అంతగా కావాలనుకుంటే ... సందు చివర హోమియో డాక్టరు ఉన్నాడు. తీసుకొనివెళ్ళి చూపించండి. రెండు

పోట్లాలిస్తాడు. రూపాయి ఆయన చేతిలో పెడితే సరి పోతుంది. ఏమంటారూ?!?"

తాను మాత్రం ఏమనగలడు? అనగల సాహసం ... ధైర్యం ... అంతకు మించిన తెగింపూ తన్లో ఏక్కడివీ?

ఇంత చేతగానివాడినై నందుకు...అవసరంలో కూడా భార్య మాట జవదాటలేని తన పిరికితనానికీ మరోకసారి నిందించుకున్నాడు.

"ఏమండోయ్, సాయంత్రం ఆరుగంటలు బస్సులో మా చెల్లెలూ తమ్ముడూ వస్తున్నారు. మీరటు ఆఫీసుకెళ్ళ గానే ఇటు ఉత్తరం వచ్చింది. బస్టాండుకి వెళ్ళి వాళ్ళని తీసుకు రావాలి మీరు" ప్రసాద్ని చెప్పాలైనా విప్పనీయ కుండా ఉత్సాహంగా అంది శోభ.

ఆఫీసులో చాకిరీ చేసి ఇంటికి చేరుకున్నాడు. వచ్చి రాగానే భార్య హడావుడి చూస్తూ మరింత విసుక్కున్నాడు.

కాఫీ ఏమైనా ఇచ్చేదుందా?" చొక్కావిప్పి స్టాండుకు తగిలిస్తూ అడిగాడు ప్రసాద్.

"నే చెప్పింది విన్పించుకున్నారా?" రెట్టిస్తూ అడిగింది శోభ.

అంతా శ్రద్ధగావిన్న బుద్ధిమంతుడిలా తల ఆడించాడు.

"విని ... మీరలా నిమ్మకు నీరెత్తినట్లు ఊరుకుంటా రేం? స్నానం అదీ త్వరగా కానిచ్చి తెమలండీ ... అప్పుడే

అయిదు గంటలు దాటుతోంది." భర్తను హడావుడి పెట్టింది.

"నాకింకా చెవుడు రాలేదుగానీ . . . . ముందు నువ్వు కాఫీ పట్రా...' అనేసి వాలుకుర్చీలో వాలిపోయాడు.

"అదిసరే...మా చెల్లి ఎందుకొస్తున్నదీ...ఉత్తరంలో మా నాన్న ఏం వ్రాసారూ అని అడగరేం? ..." భర్త నిర్లిప్తతకు నొచ్చుకుంటూ మళ్ళీ తనే అంది.

"అన్నీ నువ్వే మాట్లాడేస్తుంటే... నేనింకేం మాట్లాడనూ?"

ఒక్క పరుగులో వంటింట్లో కెళ్ళి ఫ్లాస్కులో కాఫీ కప్పులో పోసి తెచ్చి భర్తకి అందించింది.

వేడి వేడి కాఫీని ఆర్చుకు ఆర్చుకు తాగటంలో లీనమైనాడు ప్రసాద్.

"మా చెల్లికి పెళ్ళి చూపులు ఇక్కడ ఏర్పాటు చేసేరు మా నాన్న — పెళ్ళికొడుకు ఎమ్. ఎ. పాసై చెప్పుల కంపెనీలో బ్రాంచి మేనేజరుగా ఉంటున్నాడట.మా ఊరు వెళ్ళి పిల్లని చూచేటందుకు దూరమౌతుందని వాళ్ళంటే ... మా చెల్లెల్ని తమ్ముడిని తోడిచ్చి మనింటికి పంపిస్తున్నాడు ..శెలవు దొరక్క మా నాన్న రావటం లేదని వ్రాశాడు. పెత్తనమంతా మీదేననీ కూడా వ్రాశాడు. గడ గడా ఎక్కడలేని ఉత్సాహాన్ని ప్రకటిస్తూ చెప్పింది శోభ.

అది చాలదన్నట్టు ఉత్తరం అందించింది.

"సారాంశం నువ్వు చెప్పావుగా— అది చాలు! నాకు బాత్ రూములో నీళ్ళు పెట్టు..." నిస్సారంగా నవ్వుతూ అన్నాడు ప్రసాద్.

ఒక్క అంగలో బాత్‌రూమ్‌లో వేడి నీళ్ళు పెట్టి వచ్చింది.

తుండు కట్టుకుని, బాత్‌రూములోకి జొరబడ్డాడు ప్రసాద్.

భర్త వీపు రుద్దుతూ, "ఉత్తరం చూడగానే రిక్షాలో మార్కెట్టు కెళ్ళి కూరలు తెచ్చేశాను. మీరు బస్టాండు కెళ్ళి వాళ్ళని తీసుకొస్తూ ఒక శేరు మల్లెపూలు పట్రండి..." అంది శోభ.

'పెళ్ళి చూపుల రోజున వేద్దువుగాన్లే మీ చెల్లెలికి పూలజడ. ఇప్పుడెందుకు, శేరు పూలు?' గొణిగాడు.

"మీకు అంతా వేళాకోళమే.... కంది పచ్చడి రుబ్బి ఉంచాను. బంగాళాదుంప వేపుడు కూడా చేశాను. ఇంకా ఏమైన చెయ్యమంటారా?"

ఈ రాత్రికే పెళ్ళివంట చేసేస్తున్నా వేమిటీ..." అని అడగటంలో తనవాళ్ళు వస్తే పచ్చడి మెతుకులు తప్ప గతి ఉండదు... అలాంటిది మీ చెల్లెలూ, తమ్ముడూ వస్తున్నారు గదాని ఇంత ఆర్భాటమూ అనే అర్థం ధ్వనించింది.

"మీరు త్వరగా తెమలండి... అవతల టైము అవుతూంది..." అనేసి సబ్బు చేతులు కడుక్కుని బయటికి నడిచింది శోభ.

*　　*　　*　　*

చెల్లెలు, తమ్ముడు ఇంటి కొచ్చారనే సంబరయలో ఆ రాత్రి నిద్రే లేదు శోభకి.

తెల్లవారేక చెల్లికి తలంటు పోసింది. వంటపని ఆపు చేసేసి పక్కింటివాళ్ళకు, ఎదురింటి వారికి— అస లా వీధిలో వారందరికీ తన చెల్లెలి తెలివి తేటల గురించి, చదువు గురించి తెగ పొగిడేస్తూ పరిచయం చేసింది.

ఆ మధ్యాహ్నం మైసూరు పాక్ స్వీటు, పులి హోర, హాటూ చేసింది.

అది చాలదన్నట్టు ఆ రాత్రి మొదటి ఆటకు కుటుంబ సమేతంగా సినీమాకు బయల్దేర దీసింది.

"మీరు వెళ్ళిరండి— నే నెందుకూ?... నేను సినీమా చూచి ఎన్నాళ్ళాయె?..." అనేసి తప్పుకున్నాడు ప్రసాద్.

"మీ రెప్పుడూ ఇం తే!... ఊరంతా ఒక దారైతే ఉలిపి కట్టెది మరో దారన్నట్టు... మాతో కలిసి సినీమాకి రావటం మీకు నామర్దా కాబోలు..." ఎత్తి పొడుపుగా అంది.

"పిల్లలూ మీరు వెడితేనే పది రూపాయల పైనవు తుంది ఖర్చు... ఇక నేనూ మీతో పాటు తగుదు నమ్మాని బయలు దేరితే నా ఖర్చు రిక్షా బాడుగలూ అన్నీ కలిసి ఇరవై రూపాయలౌతయ్. ఎందు కొచ్చిన ఖర్చు చెప్పు, శోభా?" నచ్చచెప్ప బోయాడు ప్రసాద్.

"అక్కడికి మీ రొక్కరే ఆదా చేస్తున్నట్టూ— నేనేమో దుబారా చేస్తున్నట్టూ... అంతేకదూ మీ రనేది రాకరాక మా చెల్లి. తమ్ముడు వచ్చారు. జన్మాని కొక శివ రాత్రి అని... కనీసం మనం సినిమా అయినా చూపించ లేదని అనుకోరూ..."

"సరే... సరే... నీతో వాద నెందుకుగానీ... మీ రెళ్ళిరండి..."

"మీకు ఆకలనిపిస్తే... వంట చేసే ఉంచాను... మీరు పెట్టుకుతినండి?... ఇల్లు జాగ్రత్త..." అనేసి చెప్పి శోభ సినిమాకి బయలు దేరింది, సకుటుంబంగా.

ప్రసాద్ ఇంటికి తెచ్చుకున్న ఆఫీసు ఫైళ్ళు చూచు కుంటూ కూర్చున్నాడు.

భార్య మనస్తత్త్వమే బొత్తిగా అర్థం కాకుండా ఉంది ప్రసాద్‌కి. లేదు. లేదనుకుంటూ ఎందుకొచ్చిన అనవసరపు ఖర్చులు అని వాపోయాడు. అదేమంటే, తను తగాదాకి దిగిన వాడవుతాడు. అది తనకు గిట్టని పని. స్త్రీకి సంపూర్ణ

స్వాతంత్ర్యం, స్వేచ్ఛ ఇవ్వాలనుకునే వారిలో తాను ప్రథ ముడు. తన మంచితనాన్ని రానురాను చేతగానితనంగా తీసుకుని శోభ ప్రవర్తించటం చూస్తుంటే మనసుకి బాధన్పిస్తూంది.

పది గంట లయ్యేసరికి సినిమానుంచి అంతా తిరిగి ఇల్లు చేరుకున్నారు.

వస్తూనే మరదలు మంచం మీద వాలిపోయింది. మనిషి మూలుగుతుంది.

శోభ చెల్లెలి నుదుటికి అమృతాంజనం పట్టించింది. పావుకిలో మిరపకాయలు ... శేరు ఉప్పు దిష్టి తీసి వేసింది శోభ.

" ఏమిటే ఆ కంగారూ... అసలేం జరిగిందీ... వెళ్ళేటప్పుడు కులాసాగానే ఉందిగా... అడిగేడు ప్రసాద్.

"అంతా దీని వంక చూసేవాళ్ళే ... పాపిష్టి కళ్ళు ఎవరి దిష్టి తగిలిందో ఏమో? ... ఉన్నట్టుండి పిల్ల డిలా పడి పోయింది..." వాపోయింది శోభ.

"ఓస్‌– అంతేగదా... తెల్లారేసరికి తగ్గిపోతుందిలే... కాస్త మజ్జిగ అన్నంతిని పడుకోమను... వేడిచేసి ఉంటుంది..." సలహా ఇచ్చేడు ప్రసాద్.

"మీకు అంతా ఎగతాళే..." అనేసి చెల్లెలి అనారోగ్యం పట్ల ఆందోళన ప్రకటించింది శోభ.

తెల్లవారేక కూడా జ్వరం తగ్గక పోయే సరికి శోభ ప్రాణం విలవిల్లాడి పోయింది.

నిమిషానికొకసారి చెల్లెల్ని పరామర్శిస్తూ...

అయిదు నిమిషాల కొకమారు తడిగుడ్డ నుదుటి మీద ఉంచుతూ చెల్లెలి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూంది శోభ.

అయిదు గంటలు కొట్టే సరికి ప్రసాద్ ఇల్లు చేరుకున్నాడు.

"అట్లా చేతులు ఊపుకుంటూ రాకపోతే జ్వరంతో పిల్ల ఇంట్లో వుందికదా... వచ్చేటప్పుడు గ్లూకోజు పాకెట్టు... కాసిని బత్తాయిలూ... ద్రాక్ష పట్టుకురాకూడదూ?... ఒక్క రోజు జ్వరానికే పిల్లది తోటకూరకాడయిపోయింది... కోలుకోవాలంటే మళ్ళీ ఎన్నాళ్ళు పడుతుందో ఏమో?... పైగా రేపు గురువారమే పిల్లని చూచేటందుకు పెళ్ళివారొస్తున్నారాయె..." భర్తనుద్దేశించి గడగడా మాట్లాడింది శోభ విసుగు, అసహనం ప్రదర్శిస్తూ.

"అయిందా నువ్వు మాట్లాడటం – ఇంకా ఏమైనా ఉందా? నా చెల్లెకి హోమియో మందు తప్ప ఇప్పించలేక పోయిన బీదవాణ్ని నేను... నువ్వు పళ్ళూ గ్లూకోజులూ తెమ్మంటే ఎట్లా? అందునా నెలాఖరు రోజుల్లో..."

" అదేమంటే ఇట్లా చెప్పుతారా? మీవాళ్ళకి దోచి పెడుతున్న దాంట్లో.... మా వాళ్ళకి మీరు ఖర్చుపెడుతున్న దెంత? అనేదానికైనా అర్థముండాలి కాస్త..." రుసరుస లాడింది శోభ.

"నువ్వేమైనా అనుకో—నావద్ద చిల్లిగవ్వకూడా లేదు. బదిలీ అయిపోతున్న మా ఆఫీసరుకి పార్టీ ఇవ్వాలంటేనే ఒక రూపాయి చందా ఇవ్వలేకపోయాను...." నిక్కచ్చిగా చెప్పేడు.

"మీరు ఈమాట అంటారని నాకు తెల్సు! అందుకే నా జాగ్రత్తలో నేను ఉన్నాను" అనేసి గబగబా తన పెట్టె దగ్గరకు వెళ్ళిపోయింది శోభ.

పెట్టె తెరిచి, ప్లాస్టిక్ డబ్బాలో ఉన్న డబ్బు లెక్కిస్తున్న శోభను సమీపించి — "నాకు తెలీకుండా నీదగ్గర డబ్బెక్కడిదీ...?" అని అడిగేడు ప్రసాద్ విస్తుపోతూ.

"మీకు మల్లే ఉద్యోగంచేసి సంపాదించక పోయినా... నెల నెలా కాస్తో కూస్తో మిగుల్చుకున్నది దాచేను. చీర కొనుక్కుందా మనుకున్నాను. చివరికి నా దాపరికం ఇందుకు ఉపయోగపడ్డది" కటువుగా జవాబిచ్చింది శోభ.

అందుకు నిర్ఘాంతపోయాడు ప్రసాద్.

మూసిన కన్ను తెరవకుండా జ్వరంతో విలవిల్లాడి పోతున్న తన చెల్లెలికి డబ్బు వుంచుకునీ బయట పెట్టలేదు

శోభ. అలాంటిది ఆమె చెల్లెలి విషయంలో స్వంత ఖర్చుకని దాచుకున్న డబ్బునికూడా వెలికితీసి ఖర్చుపెట్టేందుకు సిద్ధపడుతూంది.

"మీరు ఇంట్లోనే ఉండండి.... నేను దాన్ని రిక్షాలో తీసుకెళ్ళి గోపాలంగారి దగ్గర చూపించి, ఇంజక్షను ఇప్పించి, మందులు వ్రాయించుకొస్తాను..."

"గోపాలంగారి దగ్గరికెడితే ఫీజు పాతిక రూపాయలవుతుందే..."

"ఏం అయితే? ముందు పిల్లదాని జ్వరం తగ్గాలి.. అవతల పెళ్ళి చూపులు ముంచుకొస్తున్నాయ్.... మీరేం మాట్లాడకండి ..?" అని ఆజ్ఞాపించింది శోభ.

అందుకు మారు మాట్లాడలేకపోయిన ప్రసాద్ ఒక కంట్లో బెల్లం మరో కంట్లో సున్నం పెట్టుకున్న విధంగా ప్రవర్తిస్తున్న భార్యబుద్ధికి లోలోపలే నిందించాడు.

[4-10-78 ఆంధ్రప్రభ వారపత్రిక నుండి]

ఇదే రచయిత వ్రాసిన

# సుజాత

కథల సంపుటి చదివేరా? —

లేకుంటే ఈ క్రింది అడ్రసుకు

రూ. 9/– మనియార్డరు ద్వారా పంపండి!

పోస్ట్ ఖర్చు మేమే భరించి పంపిస్తాం!

(పుస్తక విక్రేతలకు ఆకర్షణీయమైన డిస్కౌంటు)

## వసుంధరా పబ్లికేషన్సు

చిత్తూరు.